# చలికాలపు రాత్రి

[ఒక కుర్రాడు డబ్బులేక కోటు తాకట్టుపెట్టి కోటులేక చలిలో చచ్చిపోయాడనే విషయం ఈ కథలో ప్రధానాంశం (అనువాదకుడు.)]

ఆలోచిస్తూ, మజ్జాదీపం వెలుగులో, జనవరి రాత్రి గుండెలు కొట్టుకుంటున్నట్లు గడియారం టిక్‌టిక్ మంటూ, రేడియో నిశ్శబ్దంలో సంగీత సముద్రాలు, ఈలలు, కేకలు, కూనిరాగాలు, నాట్యాలు, నింపాదిగా, పేలాపన, ఆహా అందమైన సిగరెట్, గజ్జల గుర్రం ఏ ఊహనీ ఎగరేసుకు పోకుండా, ఆకాశాలు దాటేసే అమిత వేగంతో, అందమైన మృత్యువు అందించే ముద్దుల రుచి వాస్తుందా? మృత్యువులోని అందం వస్తుందా? ఎవరొస్తారో ఎవరొస్తారో, అందరు పిల్లల మొగాలూ తుడిచిపెట్టుకు పోవలసిందే, అందరు బిడ్డలూ తమ చిన్న పాదాలతో ప్రపంచాన్ని దాటి పైకి పోవలసిందే, అందరు పిల్లలూ నిష్క్రమించవలసిందే.

ఆలోచిస్తూ, జనవరి రాత్రి అన్ని ముఖాలూ, అన్ని ఆకారాలూ, అన్ని ఊహలూ పోవలసిందే పోవలసిందే; వొచ్చే దేదీ లేదు. మెల్లి మెల్లిగా వేగంగా క్షణం బద్ధలై చచ్చిపోవడం, క్షణంయొక్క, మృత్యువుయొక్క, యొక్క యొక్క మృత్యువెవరిది? ఆలోచిస్తున్న దెవరు? ఎక్కణ్నుంచి చీకట్లో, భరతనాట్యపు ప్రశాంతిలో, గందరగోళపు నిశ్శబ్దంలో, ఎవరు వారు, ఎవరు ఎక్కణ్నుంచి ఏ జీవనప్రమదావనం, ఏ మృత్యువు ఇరుకుసందు పొడుగాటి ఏడుపుముఖాల యూకలిప్టస్ చెట్లు జనవరి గాలిలో కొన్ని శతాబ్దాల పిమ్మట సంగీతయుక్తంగా ఏ దుఃఖం లేనిదే ఏడుస్తూ.

ఆవులిస్తూన్న గ్రామొఫోన్ చూసే తేరిచూపు ఊసుపోనితనపు అపశ్రుతుల నీడలు గోడనానుకొని సున్నపు పెల్లలూడి పోతున్న గోడలు. ఒంటరితనాన్ని దాచడానికి గోడలు. మనుష్యులందరూ మాయమై పోయే క్షణాలవైపు నడవవలసిందే. మనుష్యులందరూ అక్షరాలలోంచి భూమివైపు చుట్టుకుపోవలసిందే - చూస్తున్న కళ్ళు చూడరాదు, వింటున్న చెవులు సముద్రపు హోరు మాత్రమే వినాలి, ఆకాశాలు బద్దలైనప్పటి విశ్వవీణా నిశ్శబ్దాన్ని వినాలి. చేతులన్నీ లోతుగా మంటలో పూడ్చుకుపోయి కుళ్ళిపోవాలి, మనుష్యుల కళేబరాలమీద బట్టలుతీసి షాపుల్లో అమ్మెయ్యాలి, అయిపోతూన్న రాత్రి ఎప్పటికీ అయిపోదు. శిథిలాలమధ్య నిద్రపోకుండా కూర్చున్న

మనిషి మళ్ళీ దెయ్యమై వచ్చి తన బట్టల్ని షాపులో అమ్మజూపుతూన్న దృశ్యం చూడాలి.

ఓ మంచి మజాగా ఉంది జనవరి మాసం. రేపటి యూకలిప్టస్ చెట్లు ఇవాళ చచ్చిపోతూన్న మనుష్యుల కోసం అనాలోచితంగా ఏడుస్తున్నాయి. ఇవాళ చచ్చిపో తున్నారు. రెండువందల ఏళ్ళ కింద చచ్చిపోయారు అంటే క్రితం క్షణం అన్న మాట. అడుగో ఆ సిగరెట్టు కాలుస్తున్న కుర్రాడొకడు, ఇందాకా అక్కడున్నది వాడే అక్కడే ఆ యింట్లోనే ఆవులిస్తూన్న గ్రామొఫోనుని చదువుతూ. ఏదీ ఇప్పుడా అబ్బాయి? ఏదీ వాడి కోటు?

ఎవరితోనూ చెప్పకుండా చచ్చిపోవడంలో ఓ లాలిత్యం వుంది. ఒక జీవిత శకలం మధ్య, ఇంకొకడి మృత్యుశకలం మధ్య. రెండువేల సంవత్సరాల కిందట ఇంకొకడి మృత్యువులో భాగం మజ్దా వెలుతురులో నిలబడ్డంలో కొంత నాగరికత లేకపోలేదు. రాత్రిళ్ళు నిద్రను చంపడానికి మనం కనిపెట్టిన గొప్ప యంత్రం విద్యుద్దీపం, నిలుచున్న పాటున చనిపోయే కుర్రాళ్ళకి మనం సమర్పించే నివాళి, నిద్ర లేకుండా మజ్దావెలుతుర్లో నిలబడే కుర్రాళ్ల మేలుకొని చచ్చిపోవడం, నిద్రలో జీవించడం, నాగరికతకూడా ఓరకం నిశ్చలత్వమే. చెప్పకుండా చచ్చిపోవడం లాంటిది, అదో భరతనాట్యం, శిలాభంగిమ, కఠిన పాషాణం, ప్రవాహం కాదు, కదలిక లేదు, ఎగసిపడే కెరటాలుకావు, పర్వతం బద్దలైనట్టు నాట్యం, నాజూకైన ఆకాశం; ముద్దొచ్చే అర్థంలేని మాట.

ఇప్పుడేమంటున్నారో అప్పుడూ అదే అంటారు. అంతర్ముఖులుగా తిరిగి ఒక మాటు బహిర్ముఖులుగా తిరిగి ఇంకోమాటు భావనేత్రాన్ని ముందరికి తిప్పి, వెనక్కి పట్టుకొని ఇప్పటిలాగే అంటారు అప్పుడు కూడా. ఏమనంటే ఒక సిగరెట్టు క్షణంలో, మజ్దా నిద్రా దరిద్రతలో, ఇక్కడే ఇక్కడే, నిద్రపోకుండా నిలుచున్నాడు హఠాత్తుగా మేలుకున్నాడు హఠాత్తుగా మృత్యువులో జీవించాడు. కాని ఇంతట్లోకే ఏమయింది ఇక్కడ వున్న ఇల్లు కనబడదు. ఎటొచ్చీ ఒక చెట్టు ఒక పెద్ద బలిసిన, దళసరి, ఒంటెత్తు, జాలిలేని, బలిష్ఠమైన యూకలిప్టస్ చెట్టు గాలిలో మూర్ఛపోతూ, పిట్టల్ని ధరించి, ఇదిగో ఇక్కడే ఒకక్షణం క్రితం, వాడి మొగాన్ని చూశాం వెలుగులో, నెమ్మదిగా, మృత్యువును పరిహసిస్తూ, మృత్యు సమక్షంలో వినమ్రత ప్రదర్శిస్తూ, మృత్యువును కాంక్షిస్తూ, వేళాకోళం చేస్తూ, ఇదిగో ఇక్కడే మహాపర్వతాలని తన ఊపిరితిత్తులలోకి పీల్చుకోవడం విన్నట్టే వుంది. మళ్లా ఊహల రూపంలో పైకి పంపించివెయ్యడం కూడా, అదేదో కాలంలో, మానవునిలో తనలోనే ఒక భావ

మైనట్టుకాని ఇంతట్లోకే ఇక్కడ ఇల్లులేదు. ఈ చెట్టుమాత్రం మిగిలింది. ఏది నిజం ఏది అబద్ధం కాదని మనం అనగలం. సాక్ష్యంకోసం చెప్పిన అబద్ధం అసలదేమిటి? అసలది ఎప్పుడూ అబద్ధమైనా ఇక్కడే నిలబడ్డాడని స్పష్టంగా ఎరిగి ఉన్నప్పటికీ?

ఈ క్షణాలన్నీ గడచిపోయినా ఇంకా మనకి వినబడే ఈ సంభాషణ. ఇంకా కొన్ని పర్వతాలు కూలిపోయి,కొన్ని సముద్రాలు వేరయిపోయి, కొన్ని మహాఖండాలు కొత్తగా బయలుదేరి ఇప్పుడు మనం వింటూన్న ఈ సంభాషణ నిశ్శబ్దానిది. మాటలు తుడుపులతో కనబడతాయి. అర్థంలేదు. అర్థంలేదు. అంతా అస్పష్టం. జబ్బుపడి పోయినట్టు. ఒక్క ఈ చెట్టు మాత్రం బలంగా నిలబడి మానవుడి లక్ష్యం లేకుండా ఏడుస్తూ ఇల్లున్నచోట నిలబడి ఏడుస్తూ సంభాషణ నింపాదిగా వినబడుతోంది మరీ సరళంగా మంద్రంగా వుంది. అంచేతే చెప్పలేము. ఆ కుర్రాడే అంటున్నాడో లేక అనేక సంవత్సరాల అనంతరం ఆ చెట్టే మూలుగుతోందో అసలు నిజమన్నదే కన బడదే తోకపట్టుకొని ఎత్తి నిచ్చెనమీద నిలబెట్టి చూపించడానికి. అసలు నిజమన్నదే లేదు. ఆకాశంలోంచి. నిశ్శబ్దం లోపలవచ్చేదంతా ఊహల చల్లని సంస్పందనం. ఎవరో మనిషి మాట్లాడినట్టే. చెట్టు చిటారుకొమ్మల కదలిక. జీవితాన్ని పీల్చుకుంటూ కుర్రాడి చావును స్మరిస్తూ.

కాని సత్యమేదీలేదు. సమస్య పులుముకుపోయింది. చరిత్రకారులు గాభరాపడి పోయి నిలబడిపోతారు. చవులు రాలుతూన్న కొండ ఇంకా చవుడు రాలుతుంది. ఆ కొండకి లోపలా, వెలుపలా, సత్యం కారులాడుతుంది. నీళ్ళకి లోపలా వెలుపలా చంద్రుడులోంచి బంగీకట్టి పంపించిన నీళ్ళు, కెరటాల ప్రత్యేకపుటమ్మకం. పంట్లాం వెల పది రూపాయల బేడ. టోపీ తాకట్టుపెడితే చేతిలో పావలా పడు తుంది. నెక్‌టై ఎవడూ తాకట్టుపట్టడు. ఏ బజారులోనూ చెల్లదు. అబ్బేదాన్ని అమ్మ జూబితే లాభంలేదు.

అంచేత మరో సిగరెట్టు కాల్చుకోవడమే మంచిది. మరోమాటు కాలెండరు వేపు చూసి ఇవాళ తారీఖు అచ్చులో అసందిగ్ధంగా ఇది జనవరి మాసమే అని తెలు సుకో, ఆ చూస్తున్నది నువ్వే అనుకో. ఆ మూల కూర్చుని తన మౌనాన్ని ఆరాధించు తున్న ఆవలించే గ్రామఫోన్‌ని ఓమాటు ముట్టుకో; ఇంతట్లోకే తెల్లారిపోతుంది చెట్టు పడమటగా ఒరిగేలోగా.

సంవత్సరం ఈ సంవత్సరమే. క్షణం ఈ క్షణమే అప్పుడే చెట్టూ కొండా కలిసి మాట్లాడగలిగిన తతిమ్మావాళ్ళతోబాటు అంటున్నాయి; బహుశా, కాని కేవలం

బహుశా, ఇక్కడే కాబోలు. ఈ ధరిత్రిలో సరిగ్గా ఈ స్థలంలో రోడ్డుపక్క నిలబడి క్రమంగా భూమిలోకి హరించుకుపోతున్నాడు, కుర్రాడు. నగరం తన గర్భంలోకి తీసుకుంటోంది కాబట్టి అధ్యక్షపుంగవా నువ్వు లేచి ఆవులించి నీలో నువ్వు ఉపన్యసించుకో. సోదర సోదరీమణులారా! అదను దగ్గరపడింది. ఈ ప్రపంచం పేరిట మీ ప్రతిపాదనను అంగీకరిస్తున్నాను. నాకు కలుగజేసిన గౌరవాన్ని వినయ విధేయతలతో స్వీకరించి న్యూయార్కునుంచి టోకియోదాకా శ్మశానాలలో పువ్వులు మొలిపిస్తూన్న గొప్పగొప్పవాళ్ళందరి పక్కనా నిలబడుతున్నాను. వినమ్రభావంతో ఈ గౌరవ పదవిని మోస్తూ మీ కందరికీ మ్రొక్కి నా యొనర్పింపబోవు నుపన్యాసమునకు సారాంశం బెద్దియన మహాశయులారా నా బలాన్ని ధారపోసి,నా రక్తంలో మాంసంలో చర్మంలో అస్థులలో ఉన్న శక్తి యావత్తూ వినియోగించి సూర్యకాంతపు పుష్పాలకు ఆహారమైపోతాను. ఎంచేతనంటే వాటి బలం అద్వితీయం. అవి అచ్చంగా సూర్యుడిలాగే ఉంటాయి. మిగిలినవన్నీ సూర్యుడికి హీనమైన అనుకరణలు. మిణుగురులూ, మిడిగుడ్లూ, మినుములూ, మిడతలూ, చిన్నవీ, పెద్దవీ ఈ దృశ్యాన్ని చెడగొడుతూ నిరాశ హెచ్చిస్తూ అందాన్ని పెంపొందిస్తాయిలెండి. వాటికి జాగా ఇచ్చేసి నేను నింపాదిగా తప్పుకుంటాను. మహాశయులారా నేను ఆడిన మాట తప్పను. పువ్వుల కోసమని నేను దండంపెట్టి సెలవుపుచ్చుకుంటున్నాను. పోతున్నాను, పోతున్నాను. పోయాను.

గడియారం పలుకుతూన్న భాషకి ఇంకా స్పష్టత ఏర్పడలేదు—సుమారుగా ఉంది. రాత్రి జనవరి మాసానిది. ఇక్కడే ఆ కుర్రాడు మెల్లిగా తన కోటు విప్పి మెల్లిగా షాపువాడి చేతిలోపెట్టి మెల్లిగా షాపువాడితో అన్నాడు, చూడండీ ఇదో ఖరీదైన కొత్తకోటు కాకపోవచ్చు. చాలాకాలంనుంచీ నేను తొడుక్కుంటున్నాను. కాని ఇంకో పేదకుర్రాడు దీన్ని తొడుక్కొని ఇంకో చలికాలం గడపవచ్చు. నాకు కావలసిందంతే. ఇంకో పేద కుర్రాడు ఇంకో చలికాలం వెచ్చగా ఉండాలి. అది మన సంప్రదాయం. దాన్ని మనం కాపాడాలి.అప్పుడే మనకాలం అయిపోయిందంటున్నారు. అప్పుడే రెండు శతాబ్దాలు అనుకున్నకంటె ముందుగానే వచ్చి తొందర చేస్తున్నట్టు పుకార్లు బయలుదేరాయి.ఇంకా పుట్టని పాపలు చాలామంది ఈ లోకంలోకి వచ్చేస్తామని కళ్ళు వాచిపోయేటట్టు ఏడుస్తున్నారు. తమ కాళ్ళ మీద తాము నిలబడాలని ఇదివరకు ఆడిన నాటకాన్నే ఇంకోమారు ఆడాలని అనగా ఒక బిడ్డ, మగ, ఇంకో బిడ్డని, ఆడదాన్ని, తీవ్రంగా వాంఛించడం, మళ్ళీ వాళ్ళలో అసంఖ్యాకంగా అలాంటి వాళ్ళే ఆ వాంఛనే అంతకన్నా తీవ్రంగా. అంచేత చూడండీ ఈ కోటు కప్పుకుని ఇంకో కుర్రాడు

ఇంకో చలికాలం బతికి తీరాలి. లేకపోతే అంతా సమాప్తమైపోతుంది. నేను వెళ్ళిపోయానంటే శాశ్వతంగా వెళ్ళిపోతాను. నాతోబాటు ఈ రెండో అతనూ పోతాడు. అప్పుడు ఎలుకలు హేళనగా నవ్వుతాయి. మానవుడు తన చచ్చిపోయిన నెత్తిని గోకుంటూ అయ్యో మనం ఎలుకలకి లోకువయిపోయాంగదా అనుకుంటాడు. ఎలుకలు త్వరగా పిల్లల్ని కంటాయి. ఆలస్యంగా చచ్చిపోతాయి. అందుకే మనల్ని చూసి అవి నవ్వుకుంటాయి.

కాబట్టి నేను నెను సెలవుతీసుకుంటున్నాను. ఇదిగో ఇక్కడే. ఈ ఇంట్లోనే. కాని ఇప్పుడిక్కడ ఒకపెద్ద చెట్టుంది. సెలవు. పెద్ద చెట్టుంది కాబట్టి సెలవు. అన్ని చోట్లా అంతమందీ ఏదో వెదుక్కుంటూ ఎన్నడూ కనుక్కోలేకపోతూ అందరూ అంతటా ఎవరువారు నాకు సెలవిప్పించండి. ఎక్కడ మాయమై పోయారో నాకు నాకు సెలవిప్పించండి. ఇదివరకు ఇక్కడే. మళ్ళీ ఇప్పుడూ ఇక్కడే. ఇంతట్లో పగలు. ఇంతట్లో రాత్రి. ఇలా రావడం అలాపోవడం. ఆహా! దయామయా. నువ్వీ ఇంట్లో లేనేలేవు సెలవు సెలవు. ఇంతట్లోనే పగలు ముగిసిపోతోంది. శూన్యం లోకి జాలిగా మృత్యువు వస్తోంది కాబట్టి సెలవు పుచ్చుకోవాలి. అహో! భగవంతుడా. నిన్ను వెతుక్కుంటూన్న మాకు చీకటిలోని శూన్యం దొరుకుతుంది. అందుచేత సెలవు. అదిగో. చెట్టు ఆ పెద్దచెట్టు-భూగర్భంలో లోతులోతులికి తన వేళ్ళని పంపిస్తోంది. ఎప్పుడో ఒకప్పుడు ఈ భూగోళాన్ని బద్దలు కొట్టడానికి జేస్తున్న సన్నాహం కాలంలో. భగవంతుడిలో కలిపి వెయ్యడానికి సన్నాహం: ఓ ఈశ్వరా. నిన్ను వెదుక్కుంటూ మేము ఏడవకుండా నశించిపోతాం ఏ నొప్పీ లేకుండా. కాని ఈ వాంఛలకి అంతులేదు. ఇంకా ఇంకా అడుగుతాం కాబట్టి సెలవు. ఎల్లప్పటికీ సెలవు. ఇక్కడే ఒకక్షణం కిందటనే ఆ కుర్రాడి మొగం దేవుడివేపు చూసి వెర్రిగా నవ్వడం మేము చూశాం. ఇప్పుడున్నదల్లా ఈ పెద్ద చెట్టుమాత్రం ఎవరికోసం ఏడవకుండా ఏ భావం కోసం విలపించకుండా ఏ దేవుణ్నీ వెదుక్కోకుండా తానే దైవాంశ కాబట్టి సెలవు: ఇప్పటికీ ఎప్పటికీ సెలవు.

మూలం: William Saroyan